

న్యాయవాదులు విధుల బహిష్కరణ

ప్రజాశక్తి - రామచంద్రపురం

న్యాయవాదుల సంక్షేమ నిధి పేరిట అన్ని అప్లికేషన్స్ మీద రూ.20 స్టాంపులు అతికించాలని బార్ కౌన్సిల్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ తీసుకున్న ఏకపక్ష నిర్ణయానికి నిరసనగా రామచంద్రపురం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం న్యాయవాదులు విధులు బహిష్కరించారు. 9, 10, 11 తేదీల్లో న్యాయవాదులు విధులు బహిష్కరించాలని అసోసియేషన్ నిర్ణయించిందని అసోసియేషన్ అధ్యక్షులు పెల్లి మురళీమోహన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రామచంద్రపురం బార్ కౌన్సిల్ అధ్యక్షులు పిల్లి మురళీమోహన్, కార్యదర్శి వాడ్రేవు సాయిప్రసాద్, ఉపాధ్యక్షులు డిఎస్ఎస్‌జశర్మ, జాయింట్ సెక్రెటరీ చిన్నం వీరెడ్డి, కోశాధికారి చక్రవర్తి సంఘ సభ్యులు పృథ్వీ, సత్యవాణి, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

అప్పుల ఊబిలో అంగన్‌వాడీలు

- బిల్లుల చెల్లింపులో సర్కారు జాప్యం
- పెరిగిన ధరలతో సతమతం
- గ్యాస్ భారమూ వారిపైనే...

ప్రజాశక్తి - అమలాపురం

అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు పోషకాహారం అందిస్తున్నామని పాలకులు ఊకదంపుడు ప్రసంగాలు చేయడం తప్ప వాటి నిర్వహణకు కృషి చేస్తున్న అంగన్‌వాడీల సమస్యలను మాత్రం పట్టించుకోవట్లేదు. పెరిగిన నిత్యావసరాల ధరలకు తోడు బిల్లులు విడుదల చేయకపోవడంతో అప్పుల ఊబిలో కూరుకుపోతున్నామని అంగన్‌వాడీలు వాపోతున్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది.

జిల్లాలో ఏడు ప్రాజెక్టుల పరిధిలో 1,726 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో 8,043 మంది బాలింతలు, 8,834 మంది గర్భిణులు ఉన్నారు. ఆరు నెలల నుంచి 3 ఏళ్ల పిల్లలు 16,801 మంది, మూడు నుంచి 6 ఏళ్లలోపు పిల్లలు 39,170 మంది ఉన్నారు.


అంగన్‌వాడీ కేంద్రంలో భోజనం చేస్తున్న చిన్నారులు

మోయలేని గ్యాస్ బండ భారం

అంగన్‌వాడీలపై గ్యాస్ బండల భారం పడుతోంది. ప్రస్తుతం గ్యాస్ బండ ధర రూ.950 నుంచి రూ.1000 వరకూ ఉంది. పిల్లలకు గ్యాస్‌పై వంట చేసి పెట్టేందుకు అంగన్‌వాడీలకు ఒక్కో చిన్నారికి 50 పైసల వంతున చెల్లిస్తుంది. పది మంది చిన్నారులున్న కేంద్రంలో నెలకు రూ.150 మాత్రమే వస్తుంది. నెలకు ఒక గ్యాస్ బండ వరకూ అవుతుందని అంగన్‌వాడీలు చెబుతున్నారు. 15 శాతం మాత్రమే ప్రభుత్వం చెల్లిస్తుందని, మిగిలిని 85 శాతం భారం తమపై పడుతుందని వాపోతున్నారు. ప్రతినెలా గ్యాస్ రూపేణా రూ.800 నుంచి రూ.850 వరకూ గ్యాస్ భారం తమపై పడుతుందని వాపోతున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రభుత్వమే గ్యాస్‌ను ఉచితంగా సరఫరా చేయాలని వారు ఎప్పటి నుంచో డిమాండ్ చేస్తున్నారు. అయినప్పటికీ ప్రభుత్వంలో ఎలాంటి చలనం లేదు. 1726 కేంద్రాల్లో నెలకు ఒక్క గ్యాస్ బండ చొప్పున లెక్కేస్తే అంగన్‌వాడీలపై రూ.10లక్షల నుంచి రూ.14 లక్షల వరకూ పడుతోంది.

అద్దెలూ చెల్లించట్లేదు

జిల్లా వ్యాప్తంగా 520 వరకూ అంగన్‌వాడీ కేంద్రాలు అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. వీటికి అద్దెలను సైతం ప్రభుత్వం సకాలంలో చెల్లించట్లేదు. ప్రస్తుతం మూడు నెలల సంబంధించి అద్దె బిల్లులు చెల్లించాల్సి ఉది. చెల్లించే అద్దె సైతం తక్కువగా ఉండటంతో మిగిలిన భారం అంగన్‌వాడీలే భరిస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో భవన యజమానుల ఉదారతతో తక్కువ అద్దెకే ఇస్తున్నా.. మరికొన్ని చోట్ల మాత్రం అదనపు భారాన్ని అంగన్‌వాడీలే భరించాల్సిన పరిస్థితి. అర్బన్ ప్రాంతంలో రూ.4వేల నుంచి రూ.5వేల వరకూ అద్దె ఉండగా, గ్రామాల్లో రూ.3వేల వరకూ అద్దెను అంగన్‌వాడీలు చెల్లిస్తున్నారు.

పెరిగిన కూరగాయల ధరలు

అంగన్‌వాడీల్లో చిన్నారులకు ఆహారం కేంద్రంలోనే వండి పెట్టాల్సి ఉంది. మెనూ ప్రకారం వారంలో నాలుగురోజులు ఆకుకూరలు, గాయగూరలతో వారికి ఆహారం పెట్టాల్సి ఉంది. దీని కోసం కూరగాయలు, ఆకుకూరలను అంగన్‌వాడీలే స్వయంగా కొనుగోలు చేసి తెస్తున్నారు. వీటి బిల్లుల చెల్లింపులో ప్రభుత్వం తీవ్ర జాప్యం చేస్తోంది. ప్రస్తుతం మార్కెట్‌లో కూరగాయల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. అయినప్పటికీ అంగన్‌వాడీలు కొనుగోలు చేసి చిన్నారులకు పోషకారం అందేలా చూసుకుంటున్నారు. ధరల పెరిగినప్పటికీ తమకేమీ సంబంధం లేనట్టు ప్రభుత్వం గతంలో ధరలనే అందిస్తుంది. అది కూడా సక్రమంగా బిల్లులు చెల్లించకపోవడంతో ఆ భారం కూడా అంగన్‌వాడీలపైనే పడుతుంది. ప్రస్తుతం ఫిబ్రవరి నుంచి ఈ బిల్లుల చెల్లింపు నిలిచిపోయింది. ఒక్కో ప్రాజెక్టు పరిధిలో రూ.2 లక్షల వరకూ కూరగాయల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ఏడు ప్రాజెక్టుల పరిధిలో సుమారు రూ.80 లక్షల వరకూ చెల్లించాల్సి ఉంది.


ప్రచారజాతాలో మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

కౌలు రైతుల సదస్సుకు తరలిరావాలి

సిపిఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు పిలుపు

ప్రజాశక్తి - అమలాపురం

అమలాపురంలో ఈ నెల 11న జరిగే కౌలు రైతుల రాష్ట్ర సదస్సులకు కౌలు రైతులందరూ తరలి రావాలని సిపిఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరా పిలుపు నిచ్చారు. సామవారం వన్నె చింతలపూడి, తాండవపల్లి, భట్నవిల్లి, వేమవరం వేమవరప్పాడు, జనిపల్లి, అల్లవరం మండలం గుడాల కోడూరుపాడు, అల్లవరం, యెంట్రికోన, డి.రావుపాలెం, దైవగుప్తం, ఉప్పలగుప్తం మండలం సరిపల్లి, గోపవరం, కూనవరం, ఉప్పలగుప్తం, గొల్లవిల్లి, బీమనపల్లి తదితర గ్రామాల్లో ప్రచారజాతా సాగింది గ్రామాల్లో ఉన్న కౌలు రైతులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకొన్నారు. ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కౌలు రైతులకు రైతు భరోసా -పిఎంకిసాన్ పథకం అమలు చేస్తామని చెప్పారన్నారు. ఆచరణలో మాత్రం అనేక నిబంధనలు పెట్టి కౌలు రైతులకు మొండి చేయి చూపారని విమర్శించారు. ఒసి కౌలు రైతులకు రైతు భరోసా లేదన్నారు. భూ యజమాని కింద ఎంత మంది కౌలు రైతులున్నా ఒక్కరికి మాత్రమే సాయం అందుతోందన్నారు. ఈ విషయంపై అమలాపురం నల్ల వంతెన రోడ్డు, షాదీఖానా బిల్డింగ్ వద్ద అక్టోబర్ 11న రాష్ట్ర సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, రైతు స్వరాజ్య వేదిక జాతీయ నాయకులు విస్సా కిరణ్‌కుమార్, పిడిఎఫ్ ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు తదితరులు హాజరౌతారన్నారు. కౌలు రైతులందరూ ఈ సదస్సుకు హాజరై జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు. ప్రతి ఒక్క రైతుకు కరపత్రాలు పోస్టర్లు అందించారు. . రాష్ట్రంలోని కౌలు రైతుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నిర్వహించ తలపెట్టిన రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు. ఈకార్యక్రమంలో సిపిఎం నాయకులు బీమాల శ్రీను, విప్పర్తి మోహన్‌రావు, తాడి శ్రీరామ్మూర్తి, పి.సత్యనారాయణ, పి.బాలాజీ తదితరులు పాల్గొన్నారు

కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

ప్రజాశక్తి -ఐ.పోలవరం

ఐ.పోలవరం గ్రామ పంచాయతీలో తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలనంటూ సిఐటియు జిల్లా కార్యదర్శి జి.దుర్గాప్రసాద్ కోరారు. ఈ పంచాయతీలో ఐదేళ్లుగా పారిశుధ్య కార్మికులుగా పనిచేస్తున్న కాశి వరలక్ష్మి, మహేష్, పల్లాలమ్మ, యలమంచిలి సత్యవతి, దడాల నాగమణిని ఇటీవల తొలగించారు. విషయం తెలుసుకొన్న ఆయన పంచాయతీ కార్యాలయంకు వచ్చి సెక్రటరీని వివరాలు అడిగి తెలుసుకొన్నారు. సర్పంచ్ దంతులూరి రాఘవరాజుతో ఫోన్‌లో మాట్లాడారు. పంచాయతీలో నిధులు కొరత వల్ల కార్మికులు తొలగిస్తున్నామని సర్పంచ్ చెప్పడాన్ని ఆయన వ్యతిరేకించారు. కేంద్ర ప్రభుత్వం 14ఆర్థిక సంఘం నిధుల ద్వారా కార్మికులకు జీతాలు ఇవ్వాలని ఆదేశాలున్నాయన్నారు. అయినప్పటికీ కార్మికులను తొలగించడం సరైంది కాదన్నారు. కరోనా సమయంలో పారిశుధ్య కార్మికులు ప్రాణాలు పణంగా పెట్టి విధులు నిర్వహించారని గుర్తు చేశారు. కార్మికులను తొలగించడం చాలా అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే విధుల్లో తీసుకోవాలన్నారు. అనంతరం పంచాయతీ కార్యదర్శి గోవిందుకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో పాము బాలయ్య, సిఐటియు మండల కార్యదర్శి టి.నాగలక్ష్మి, ముమ్మిడివరపు సుబ్బారావు ఉన్నారు


కార్యదర్శితో మాట్లాడుతున్న దుర్గాప్రసాద్

నవోదయకు సాన్విత ఎంపిక

ప్రజాశక్తి - ఆత్రేయపురం

ఆత్రేయపురం మెయిన్ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న సాన్విత పెద్దాపురంలోని నవోదయలో ఆరోతరగతిలో ప్రవేశానికి ఎంపికైంది. సాన్విత ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలలో 6వ తరగతి చదువుతోంది. ఆమె తండ్రి మైలాబత్తుల సురేష్‌బాబు ఆత్రేయపురం మెయిన్ పాఠశాలలో ఉపాధ్యాయునిగా పనిచేస్తున్నారు. తన ఇద్దరు కుమార్తెలను ప్రభుత్వ పాఠశాలలోనే చదివిస్తున్నారు. సాన్విత ఎంపిక పట్ల యుటిఎఫ్ మండల శాఖ శుభాకాంక్షలు తెలిపింది.

ప్రాంగణ నియామకాల్లో 29 మంది ఎంపిక

ప్రజాశక్తి - కాట్రేనికోన

చెయ్యేరు శ్రీనివాస స్వయం ప్రతిపత్తి ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన ప్రాంగణ నియామకాల్లో కళాశాల విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబర్చారు. హెచ్‌సిఎల్ సంస్థకు చెందిన శ్రీ సోను త్యాగి ప్రతినిధుల బృందం కళాశాలలో ఈ ఎంపికలు నిర్వహించింది. మొత్తం 29 విద్యార్థులకు నియామక పత్రాలు అందించింది. ఈ సందర్భంగా విద్యార్థులను కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ డివిఎన్ఎస్.వర్మ అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ సిహెచ్‌విఎస్.పరమేశ్వరావు, పాలక వర్గ సభ్యులు సందీప్, కళాశాల టిపిఒ బి.అరుణ్‌కుమార్, బి.రత్నరాజు, కళాశాల విద్యశాఖాధిపతి ఎస్.జయలక్ష్మి, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న టిడిపి దీక్షలు

ప్రజాశక్తి - యంత్రాంగం

చంద్రబాబు అరెస్టుకు నిరసనగా జిల్లాలో టిడిపి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షలు కొనసాగుతున్నాయి. **రామచంద్రపురంలో** చేపట్టిన రిలే దీక్షలు సోమవారం నాటికి 27వ రోజుకు చేరుకున్నాయి. టిగడిపి మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు. టిడిపి రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండల, పట్టణ, గ్రామ టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **మండపేట** మున్సిపల్ కార్యాలయం వద్ద ఎంఎల్ఎ వేగుళ్ల జోగేశ్వరరావు ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరహారదీక్షలు కొనసాగాయి. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. వైసిపి ప్రభుత్వాన్ని గద్దె ఇంచడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పని చేయాలన్నారు. ఈ దీక్ష శిబిరంలో టిడిపి పట్టణ అధ్యక్షులు ఉంగరాల రాంబాబు, గుండు వీరతాతరాజు, టిడిపి అమలాపురం పార్లమెంటు మైనార్టీ ప్రధాన కార్యదర్శి షేక్ ఇబ్రహీం, బొడ్డు రామకృష్ణ, వేమగిరి మోషే తదితరులు కూర్చున్నారు. టిడిపి రాష్ట్ర మైనార్టీ సెల్ కార్యదర్శి సల్మాన్ హుస్సేన్, టిడిపి నాయకులు తదితరులు దీక్షలకు సంఘీభావం తెలిపారు.

వైసిపిని గద్దె దించడమే లక్ష్యం

ప్రజాశక్తి - ఆలమూరు

వైసిపిని గద్దె దించడమే లక్ష్యమని జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి బండారు శ్రీనివాస్ అన్నారు. మండలంలోని మోతుకూరులో తోరాటి తాతారావు, రావూరి గణపతి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జనసేన గ్రామ పర్యటనలో ఆయన పాల్గొన్నారు. తొలుత అంబేద్కర్, జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. శ్రీనివాస్ మాట్లాడారు. 2024లో ఏర్పడేది జనసేన, టిడిపి సంకీర్ణ ప్రభుత్వమేనన్నారు. ఈ కార్యక్రమంలో సత్య, సర్పంచులు, వీరమహిళలు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి : కలెక్టర్

ప్రజాశక్తి - అమలాపురం

స్పందనలో వచ్చే ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కలెక్టర్ హిమాన్షుశుక్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ శుక్లా, జెసి ఎస్.నుపూర్‌అజయ్, డిఆర్ఒ సిహెచ్.సత్తిబాబు పాల్గొని ఆర్జీలు స్వీకరించారు. సుమారుగా 274 అర్జీలు వచ్చాయని తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. స్పందనలో అందే ప్రతి అర్జీని క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా విచారించి నాణ్యతో కూడిన పరిష్కార మార్గాలు చూపాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం మండల కేంద్రాల్లో మండల స్థాయి స్పందన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి బుధ, శుక్రవారాల్లో మండల కేంద్రాల్లో షెడ్యూల్ ప్రకారం నిర్వహించే జగనన్నకు చెబుదాం, స్పందన కార్యక్రమానికి తప్పని సరిగా జిల్లా స్థాయి అధికారులు హాజరవ్వాలన్నారు. నిర్ణీత కాలవ్యవధిలో అర్జీ దారుడు సంతృప్తి చెందే స్థాయిలో నాణ్యతతో పరిష్కరించాలని పేర్కొన్నారు. ఏ ఒక్క అర్జీ పెండింగ్ లేకుండా రీ ఓపెన్‌కు ఆస్కారం లేకుండా పరి ష్కారం చూపాలన్నారు. ఈ నెల 17న జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో రావులపాలెం సంహిత డిగ్రీ కళాశాలలో 17 కంపెనీల ప్రతినిధులతో జాబ్ మేళా జరుగుతుందన్నారు. సుమారు 800 పోస్టులు భర్తీ చేయనున్నారన్నారు. ఈ అవకాశాన్ని రావులపాలెం చుట్టుపక్కల నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. వ్యవసాయ మార్కెటింగ్ శాఖ ప్రచురించిన 22 రకాల వ్యవసాయ ఉత్పత్తులకు మద్దతు ధరల ప్రకటన గోడ పత్రికను కలెక్టర్, జెసి, డిఆర్ఒ ఆవిష్కరించారు. రైతన్నలకు కనీస గిట్టుబాటు ధరలు లభించే దుకు వీలుగా రూ.3వేల కోట్లతో ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేశారన్నారు. దళారుల బెడద, రవాణా ఖర్చు లేకుండా రైతు భరోసా కేంద్రాల్లోనే సిఎం యాప్ ద్వారా పంటలను కొనుగోలు చేస్తామన్నారు. కొనుగోలు చేసిన 21 రోజులకే చెల్లింపులు చేస్తున్నామన్నారు. ఈ కొనుగోలు ప్రక్రియలో చిన్న, సన్న కారు రైతులకు ప్రాధాన్య ఇస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమంలో సిపిఒ వెంకటేశ్వర్లు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎ.బోసుబాబు, ఎల్‌డిఎం శ్యాంబాబు డ్వామా పీడీ ఎస్.మధుసూదన్, హౌసింగ్ పీడీ సిహెచ్.బాబూరావు, డిసిహెచ్ఒ పద్మశ్రీరాణి, డిఎంహెచ్ఒ ఎం.దుర్గారావుదొర పాల్గొన్నారు.


స్పందనలో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

క్రీడాకారులకు ఘన స్వాగతం

ప్రజాశక్తి - మండపేట

ఇటీవల దక్షిణాఫ్రికాలో జరిగిన ప్రపంచ టెన్నికాయిడ్ ఛాంపియన్ షిప్ పోటీల్లో దేశం తరపున ఆడి గోల్డ్ మెడల్ సాధించి మండపేటకు వచ్చిన క్రీడాకారులు వడ్డాది వినయ్, పిల్లి రామారావులకు సోమవారం మండపేటలో ఘన స్వాగతం లభించింది. అనంతరం ఎంపిఎస్ అధినేత వల్లూరి చిన్నారావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో క్రీడాకారులను పూలమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ వేగుళ్ల జోగేశ్వరరావు, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి లీలాకృష్ణ, వాలీబాల్ జాతీయ క్రీడాకారుడు, కో-ఆప్షన్ సభ్యుడు రెడ్డి రాధాకృష్ణ, మాజీ మున్సిపల్ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్ మాట్లాడారు. దేశం తరపున క్రీడల పోటీలో పాల్గొని ప్రపంచ చిత్రపటంలో మండపేట పేరు, భాతదేశం పేరు నిలబెట్టారన్నారు. గత కౌన్సిల్‌లో తన హయాంలో మున్సిపల్ కార్యాలయం ఎదురుగా అత్యుత్తమ ప్రమాణాలతో ఇండోర్ స్టేడియం నిర్మాణానికి శంకుస్థాపన చేశామన్నారు. అందులో టెన్నికాయిడ్, బాల్ బాడ్మింటన్, టెన్నిస్ కోర్టులు ఏర్పాటు చేసేందుకు అవకాశం ఉందన్నారు. సురుచి సంస్థ విఆర్ఒ.వర్మ కాజాలు బహూకరించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌సి తోట త్రిమూర్తులు తనయుడు తోట పృథ్వీ, ప్రిన్సిపల్ టికెవి.శ్రీనివాసరావు తదితరులు అభినందించారు.

కొల్లు స్వామీజీకి డాక్టరేట్

ప్రజాశక్తి- ఉప్పలగుప్తం

చల్లపల్లి పంచాయతీ అంబేద్కర్ నగర్‌కు చెందిన కొల్లు స్వామీజీకి ఆంధ్ర యూనివర్సిటీ డాక్టరేట్ పురస్కారం అందించింది. ఎయు విసి ప్రసాదరెడ్డి చేతుల మీదుగా ఆయన డాక్టరేట్‌ను అందుకున్నారు. ప్రొఫెసర్ ఇళ్ల దోసగిరిరావు పర్యవేక్షణలో 'భారతదేశంలో బలహీన వర్గాల సాధికారిత- ప్రజాస్వామ్యం వికేంద్రీకరణ' అనే అంశంపై ఆయన పరిశోదన చేశారు. స్వామీజీ ఆంధ్ర యూనివర్సిటీలో డిపార్ట్మెంట్ ఆఫ్ పొలిటికల్ సైన్స్ అండ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ ఎంఎ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విద్యనభ్యసించారు. స్వామీజీ చిన్ననాటి నుంచి పేదరికంలో పెరిగి కూలి చేసుకుంటూ కష్టపడి చదివారనిబాల్యమిత్రులు జంగా శ్రీనివాస్, కొల్లు బాల మురళీకష్ణ,కాట్రు వెంకటరెడ్డి తెలిపారు.

క్రమశిక్షణ కలిగి ఉండాలి : ఎస్ఐ

ప్రజాశక్తి - మామిడికుదురు

పి.గన్నవరం మండలం నరేంద్రపురం డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో మమత స్వచ్ఛంద సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు కోరుకొండ జాన్ ఆధ్వర్యంలో ప్రిన్సిపల్ పి.వేణు అధ్యక్షతన క్రమశిక్షణ, శుభ్రతపై సోమవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పి.గన్నవరం ఎస్ఐ హరికోటిశాస్త్రి పాల్గొన్నారు. విద్యార్థి దశలోనే క్రమశిక్షణ నేర్చుకోవాలన్నారు. తోటివారి పట్ల సేవాభావం కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో మమత స్వచ్ఛంద సేవా సమితి గౌరవాధ్యక్షులు నల్లా పెద్దకాపు, కె.రాజు, పోలీస్ సిబ్బంది, పాల్గొన్నారు.

కాన్షీరామ్‌కు ఘన నివాళి

ప్రజాశక్తి - అమలాపురం రూరల్

బిఎస్‌పి వ్యవస్థాపకులు కాన్షీరామ్‌కు పలువురు ఘనంగా నివాళు లర్పించారు. ఆయన 17వ వర్ధంతి బిఎస్‌ఫి నియోజకవర్గ అధ్యక్షులు పెండెం శ్రీనివాస్ అధ్యక్షతన సోమవారం ఎ.వేమవరప్పాడులో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా బిఎస్‌పి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కోలా త్రిమూర్తులు హాజరయ్యారు. కాన్షిరామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ వారసునిగా బహుజన సమాజానికి రాజ్యాధికార ఫలాలను అందించి ఉత్తర ప్రదేశ్ రాష్ట్రంలో మాయావతిని 4 సార్లు ముఖ్యమంత్రిని చేసిన ఘనత ఆయనదేనని అన్నారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ నాగరపు ఏడుకొండలు, ఉపాధ్యక్షులు బుడితి దయామహేష్, ప్రధాన కార్యదర్శి జెఎస్‌డి,రాజు, సాకా గోవిందు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

ప్రజాశక్తి- కపిలేశ్వరపురం


పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని అంగర పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ పి.రత్నకుమారి, డాక్టర్ జివి.గీతాంజలి అన్నారు. ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం అంగర పిహెచ్‌సిలో 33 మంది గర్భిణులకు వైద్య పరీక్షలకు నిర్వహించారు. ఐదుగురు హైరిస్క్ గర్భిణులకు గుర్తిం ప్రత్యేక వైద్య సేవలు అందించారు. పౌష్టికాహారం, ఆసుపత్రిలో ప్రసవాల ప్రాముఖ్యతపై వివరించారు. ఎంపిహెచ్ఇఒ జె.మల్లికార్జునుడు, హెల్త్ ఎడ్యుకేటర్ బి.రామారావు, హెల్త్ విజిటర్ టి.మేరీమణి, ఎఎన్ఎంలు, అంగన్‌వాడీలు, ఆశాలు పాల్గొనారు.

బస్టాండ్‌లో మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - రామచంద్రపురం

కె.గంగవరం బస్టాండ్‌లో మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు, గ్రామస్తులు ఆర్‌డిఒ పి.సింధు, డిపో మేనేజర్‌కు వెంకటేశ్వర్లుకు సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎఐకెఎంఎస్ ఉమ్మడి జిల్లా నాయకులు వి.భీమా శంకర్ మాట్లాడుతూ కె. గంగవరంలో 2002లో బస్టాండ్‌ను నిర్మించారన్నారు. సుమారు 26 గ్రామాలు ప్రజలు దీన్ని వినియోగిస్తున్నారన్నారు. ప్రజల అవసరాలు కోసం బస్టాండ్‌లో సులబ్ కాంప్లెక్స్ పేరుతో మరుగుదొడ్లు, స్నానపు గదులు నిర్మాణం చేశారని, ప్రస్తుతం ఇవి పూర్తిగా శిథిలమై పనికిరాకుండా ఉన్నాయన్నారు. దీని వల్ల ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారనానరు. వెంటనే వీటిని బాగుచేయించాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో బి. సిద్ధూ, కాశీ లెనిన్‌బాబు, ఎ.ఆంజనేయులు, కె.త్రిమూర్తులు, ఎన్.పూసయ్య తదితరులు పాల్గొన్నారు

కార్టూన్ 'నిజం'



జిల్లా వ్యాప్తంగా జగనన్న ఆరోగ్య సురక్ష

ప్రజాశక్తి - యంత్రాంగం

జిల్లా వ్యాప్తంగా జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు జరుగుతున్నాయి. ఆలమూరు మండలంలోని పెనికేరులో సర్పంచ్ వనుం చిన్నావతి జార్జిబాబు, రీసర్వే డిప్యూటీ తహశీల్దార్ జానకిరాఘవ ఆధ్వర్యంలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. వైద్యులు అరుణ, షమీ ఉన్నీసా, ఆర్.మల్లిఖార్జునరావు, పి.భవానీ శంకర్, డి.సువర్చల వైద్య సేవలు అందించారు. అంగన్ వాడీలు ఏర్పాటు చేసిన స్టాల్స్ ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో కార్యదర్శి అయ్యన్న, హెల్త్ ఎడ్యుకేటర్స్ కె.జ్యోతి కుమార్, ఎంపిహెచ్ఇఒ బి.సూర్యనారాయణ పాల్గొన్నారు. **మండపేట** అర్తమూరులో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని నిర్వహించారు. సర్పంచ్ గొలుగూరి అన్నపూర్ణ ప్రారంభించారు. గర్భిణులకు సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వై సత్యవేణి, అంగన్‌వాడీలు పాల్గొన్నారు. **కపిలేశ్వరపురం** మండలం టేకి గ్రామ సచివాలయంలో సర్పంచ్ కుక్కలు నాగమణి అధ్యక్షతన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు యు.వీరవేణి, ఉప సర్పంచ్ పుట్ట రామకృష్ణ, పిఎసిఎస్ చైర్మన్ పుట్టా జానకిరామయ్య, ఎంపిడిఒ, తహశీల్దార్, వైసిపి నాయకులు పాల్గొన్నారు. **ఆత్రేయపురం** మండలంలోని రాజవరంలో సోమవారం సచివాలయం వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో వైద్యులు 400 మందికి వైద్యసేవలు అందించారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి శ్రీనివాస్, సర్పంచ్ జానా మంగాయమ్మ, ఎంపిటిసి సభ్యులు ఎన్.రాణి పాల్గొన్నారు. **ఉప్పలగుప్తం** మండలం విలసవిల్లి సచివాలయంలో వైద్య శిబిరం నిర్వహించారు. సర్పంచ్ సలాది ఊర్మిళదేవి ప్రారంభించారు. వివిధ విభాగాల వైద్యులు 372 మంది రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందించారు. వైసిపి గ్రామ కమిటీ అధ్యక్షుడు సలాది సతీష్, ఎంపిడిఒ కెవి.ప్రసాద్, ఇఒపిఆర్‌డి కెఎస్.గౌరీకుమారి, పంచాయతీ కార్యదర్శి దాసరి కృష్ణాజీ పర్యవేక్షించారు. **మామిడికుదురు** మండలం లూటుకుర్రులో జడ్‌పిటిసి సభ్యులు కె.అంజిబాబు ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. వైద్యులు డివి.సత్యం, స్వర్ణలత, తదితరులు వైద్య సేవలు అందించారు.

విద్యుత్ స్తంభాలపై పాదుల తొలగింపు

'ప్రజాశక్తి' వార్తకు స్పందన

ప్రజాశక్తి- ఉప్పలగుప్తం

విద్యుత్ స్తంభాలకు అల్లుకున్న పాదులు అనే శీర్షికపై ప్రజాశక్తిలో సోమవారం వచ్చిన వార్తకు విద్యుత్ అధికారులు స్పందించారు. విద్యుత్ శాఖ ఎఇ శ్రీహరి ఆధ్వర్యంలో సిబ్బంది ప్రధాన రహదారుల వెంబడి ఉన్న విద్యుత్ స్తంభాలకు విద్యుత్ తీగలకు అల్లుకున్న పాదుల తొలగించే పనిని చేపట్టారు. సోమవారం సాయంత్రం వరకూ కొన్ని విద్యుత్ స్తంభాలపై ఉన్న పాదులను తొలగించారు. మిగిలి ఉన్న స్తంభాలపై ఎగబాకిన పాదులను కూడా పూర్తిగా తొలగిస్తామని ఈ సందర్భంగా ఎఇ శ్రీహరి తెలిపారు. పాదులు తొలగించే పనిని చేపట్టడంతో గంటల తరబడి విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడగా విద్యుత్ వినియోగదారులు కొంత అసౌకర్యానికి గురైనప్పటికీ విద్యుత్ అధికారులు పాదులు తొలగించే పనిని చేపట్టడంతో సంతోషం వ్యక్తం చేశారు.



మొన్న ఇలా..


నిన్న ఇలా..

సోమేశ్వరస్వామి దేవస్థానం ఇఒగా శ్రీదేవి

ప్రజాశక్తి - రామచంద్రపురం

కోటిపల్లి శ్రీ చాయ సోమేశ్వర స్వామి వారి దేవస్థానం ఇఒగా ఎం.శ్రీదేవి నియమితుల య్యారు. ఈ మేరకు ఆమె సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇఒగా బాధ్యతలు చేపట్టిన ఆమెకు ఆలయంలోని అర్చకులు, పురోహితులు స్వాగతం పలికారు.



ప్రజాశక్తి
www.prajasakti.com

నేరాలు ఘోరాలు

హోటల్‌పై విజిలెన్స్ దాడి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

నగరంలోని మెయిన్ రోడ్డులోని శరవణ అయ్యర్ విజిటేరియన్ మీల్స్ హోటల్‌పై విజిలెన్స్ శాఖ అధికారులు తనిఖీలు చేశారు. హోటల్లో గృహ వినియోగ గ్యాస్ సిలెండర్లను వినియోగిస్తున్నట్లు అందిన సమాచారంతో సోమవారం హోటల్‌ను తనిఖీ చేశారు. గృహ వినియోగ గ్యాస్ సిలెండర్లను వినియోగిస్తున్నట్లు గుర్తించినట్లు విజిలెన్స్ అధికారి కె.కుమార్ తెలిపారు. ఐదు గ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకున్నామని, హోటల్ నిర్వాహకుడు జంగా లవకుమార్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో ఎస్ఐ జగనారెడ్డి, జయలక్ష్మి, లక్ష్మినారాయణ, హెచ్‌సి జీవానందం, కానిస్టేబుల్ లోవకుమార్ పాల్గొన్నారు.

కుక్కల దాడిలో వృద్ధునికి గాయాలు

ప్రజాశక్తి - గోకవరం

కుక్కల దాడిలో వృద్ధుడు గాయాల పాలైన సంఘటన సోమవారం గోకవరంలో చోటు చేసుకుంది. స్థానికులు కథనం ప్రకారం.. మండల కేంద్రమైన గోకవరం గ్రామానికి చెందిన మహిపాల తాతీలు అనే వృద్ధుడు గోకవరం విద్యుత్ సబ్ స్టేషన్ వద్దకు కరెంట్ బిల్లు కట్టి తిరిగి వస్తుండగా మార్గ మధ్యలో ఆ వృద్ధుడుపై కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపర్చాయి. స్థానికులు ఆ వృద్ధుడిని 108 వాహనంలో గోకవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా వైద్యులు ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

కుమార్తెతో గొడవ : తండ్రి ఆత్మహత్య

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

కన్న కూతురిపై అలిగిన తండ్రి విషం తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఉండ్రాజవరం మండలం వడ్లూరులో చోటుచేసుకుంది. పశ్చిమగోదావరి జిల్లా పెంటపాడు మండలం చింతపల్లి గ్రామ నివాసి వేముల మంద కాశీ విశ్వనాథ రాజు (49), కుమార్తె దండు విద్యా కవిత మూడేళ్ల క్రితం వివాహం కావడంతో వడ్లూరులో భర్త దండు వెంకట బంగారు రాజుతో కాపురం ఉంటోంది. ఈమెకు ఒక కుమార్తె సంవత్సర కాలంగా కవితను పుట్టింటికి రమ్మని తండ్రి విశ్వనాథరాజు పిలిచినప్పటికీ ఆమె వెళ్లడం లేదు. ఈ కారణంగా తనతో మాట్లాడని కూతురుతో ఎలాగైనా కలవాలని ఆదివారం వడ్లూరు ఆమె ఇంటికి వచ్చాడు. ఆమె తండ్రికి సమాధానం చెప్పకపోవడంతోపాటు, పుట్టింటికి రానని తెలపడంతో తండ్రి మనస్తాపానికి గురయ్యాడు. తనతో తెచ్చుకున్న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అపస్మారక స్థితిలోకి చేరుకున్న అతడిని చుట్టుపక్కల వారు తణుకు ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ మరణించాడు. ఈ విషయమై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కె.రామారావు తెలిపారు.

వేమగిరిలో దారి దోపిడీ

ప్రజాశక్తి - కడియం

ఉద్యోగం కోసం ఇంటర్వ్యూకి వెళ్లి వస్తున్న ఇద్దరు వ్యక్తులను అటకాయించి దారి దోపిడీకి పాల్పడిన సంఘటన వేమగిరిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...కొత్తపేట మండలం వానపల్లి గ్రామానికి చెందిన నాగాబత్తుల దుర్గాప్రసాద్, గుత్తుల హేమసాయి తేజ విశాఖపట్నం ఉద్యోగానికి సంబంధించి ఇంటర్వ్యూ ముగించుకుని ఆదివారం తెల్లవారుజామున రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్‌లో దిగారు. రైల్వే స్టేషన్లో ఉన్న తమ వాహనంపై వానపల్లి గ్రామానికి వెళ్తుండగా వేమగిరి గట్టు సమీపానికి వచ్చేటప్పటికి ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు వారిని అటకాయించారు. కత్తులతో బెదిరించి వారి వద్ద ఉన్న రూ.4,500, పర్సు లాక్కుని ఎపి 05 సిఎస్ 1891 నెంబర్ గల యాక్సిస్ మోటారు సైకిల్‌పై పారిపోయారు. దీంతో బాధితులు సోమవారం కడియం పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేశారు. దీంతో రంగంలోకి దిగిన కడియం సిఐ పివిజి తిలక్ ఎస్ఐ బాలాజీ సుందరరావు, క్రైమ్ సిబ్బంది సురేష్, లక్ష్మణరావులతో కలిసి మోటార్ సైకిల్ ఆధారంగా సోమవారం ఉదయం వేమగిరి శివారు రత్నా ప్లాస్టిక్ కంపెనీ ప్రక్కన కాళీ స్థలంలో నేరానికి పాల్పడిన వేమగిరి గట్టుకు చెందిన బేరంపూడి మోహన్ స్వామి, విప్పర్తి ప్రశాంత్ కుమార్‌ను అరెస్టు చేశారు. వారి నుంచి బైకు, సెల్ ఫోన్ స్వాధీన పరుచుకున్నారు.

పురుగు మందు తాగిన యువకుడు మృతి

ప్రజాశక్తి - పెరవలి

ముక్కామలకు చెందిన మట్టా పూర్ణ సాయి వినాయక(18) జీవితంపై విరక్తి చెంది పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆత్మహత్యకు పాల్పడిన సాయి వినాయక ఐటిఐ చదివాడు. ప్రస్తుతం ప్రయివేటుగా ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. గత ఏడేళ్ల నుంచి కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. మందులు వాడుతున్నా ఆ వ్యాధి నుంచి ఉపసమనం కలగడం లేదు. దీంతో జీవితంపై విరక్తి చెంది ఆదివారం ఖండవల్లి గ్రామ పొలంలో కలుపు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. స్థానికులు గమనించి బంధువులకు సమాచారం ఇవ్వడంతో అపస్మారక స్థితిలో ఉన్న ఆ యువకుడిని ఆసుపత్రికి తరలించారు. సోమవారం అతని ఆరోగ్య పరిస్థితి విషమించి మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎం. సూర్య భగవాన్ తెలిపారు.

యువకుడు అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని వంగలపూడి గ్రామానికి చెందిన యువకుడు అనుమానస్పద స్థితిలో మృతి చెందాడు. పోలీసుల కథన ప్రకారం...వంగలపూడి గ్రామానికి చెందిన గంప అప్పన్న(23) ఈ నెల 4న పురుషోత్తపట్నంలో కబడ్డీ క్రీడకు వెళ్లి వచ్చాడు. ఒంటి నొప్పులు ఎక్కువగా ఉన్నాయని కుటుంబ సభ్యులకు చెప్పాడు. మరుసటి రోజు మెడ పట్టిందని సీతానగరం సెలూన్ షాపుకు వెళ్లి అక్కడ స్పృహ తప్పి పడిపోయాడు. కుటుంబ సభ్యులు ఇంటికి తీసుకుని వెళ్లి ఆర్ఎంపి వైద్యునితో ప్రాథమిక వైద్యం అందించే క్రమంలోనే ఆ యువకుడు కాళ్లు, చేతులు కొట్టుకోవడంతో కుటుంబీకులు హుటాహుటీన రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే పరిస్థితి విషమించడంతో సోమవారం మృతి చెందాడు. మృతుడు అమ్మమ్మ లచ్చిరెడ్డి రమణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, పోస్టుమార్టంకు మృతదేహన్ని రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలని టిడ్కో వాసుల ధర్నా

ప్రజాశక్తి - పెద్దాపురం



ఆర్‌డిఒ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న కాలనీ వాసులు

పెద్దాపురం-వాలుతిమ్మాపురం రహదారిలోని టిడ్కో కాలనీలో సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ఆర్‌డిఒ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్‌డిఒ జె.సీతారామారావుకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి నీలపాల సూరిబాబు మాట్లాడుతూ టిడ్కో కాలనీని మున్సిపాలిటీకి అప్పగించామని టిడ్కో అధికారులు చెబుతున్నారని, మున్సిపల్ అధికారులు మాత్రం తమకు ఈ కాలనీని అప్పగించలేదని అంటున్నారన్నారని చెప్పారు. ఈ కాలనీలో ఐదు మంచి నీటి బోర్లు ఉన్నప్పటికీ ఒకటే మాత్రమే పని చేస్తోందన్నారు. ఈ బోరు నుంచి వివిధ ప్రాంతాలకు మంచినీటిని సరఫరా చేసే ఆపరేటర్‌ను మున్సిపాలిటీ నియమించలేదన్నారు. దీంతో కాలనీ వాసులు మంచినీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అపార్ట్‌మెంట్లలో వాడకం నీరు ప్రవహించే అండర్ గ్రౌండ్ డ్రైనేజీ అక్కడక్కడ పూడుకుపోవడంతో మురుగునీరు ప్రవహించే దారి లేక అపార్ట్మెంట్లు వద్ద మురుగునీరు పేరుకు పోతోన్నారు. దీంతో అపార్ట్మెంట్లలోకి వెళ్లాలంటే మురుగు నీటిలో నుంచి నడుచుకుంటూ వెళ్ళవలసి వస్తోందన్నారు. ప్రజలు దుర్వాసనతో అవస్థలు పడుతున్నారన్నారు. ఈ కాలనీలో నివసించే ప్రజలు రేషన్ కోసం తాము గతంలో అద్దె ఇళ్లల్లో నివసించిన ప్రాంతాలకు వెళ్లి రేషన్ తెచ్చుకోవాల్సి వస్తోందని, వృద్ధులు పింఛను తీసుకోవడానికి కూడా ఎంతో దూరం వెళ్ళవలసి వస్తోందన్నారు. పింఛను, రేషన్ ప్రతి నెలా ఈ కాలనీకి వచ్చి అందజేసే ఏర్పాటు చేయాలన్నారు. ఈ కాలనీలో అక్కడక్కడా మాత్రమే వీధిలైట్లు వెలుగుతున్నాయని, కాలనీలో తుప్పలు, డొంకలు విపరీతంగా పెరిగిపోయాయన్నారు. దీనివల్ల పాములు సంచరిస్తున్నాయని, దీంతో ప్రజలు రాత్రి సమయంలో కాలనీలో తిరగడానికి భయపడుతున్నారన్నారు. ప్రతిరోజు మున్సిపాలిటీ నుండి ఈ కాలనీలో చెత్త సేకరణకు ట్రాక్టర్లు, సిబ్బంది రాకపోవడంతో కాలనీవాసులు ఎక్కడపడితే అక్కడ చెత్త వేయవలసి వస్తోందన్నారు. ప్రతిరోజు ఈ కాలనీ నుంచి చెత్త సేకరణకు సిబ్బందిని నియమించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు గడిగట్ల సత్తిబాబు, సిరపరపు శ్రీనివాస్, నెక్కల నరసింహమూర్తి, దారపురెడ్డి కృష్ణ, చల్లా విశ్వనాథం, కాలనీవాసులు బర్ల శ్రీను, తాతపూడి శ్రీనివాస్, చింతల బలరాం, కె.దుర్గాప్రసాద్, కందికొండ శ్రీదేవి, మండ పద్మావతి, గండి శివాని, ఉరిటి చంద్ర, కొమరి పార్వతి, నమ్మి నూకరత్నం, స్వాతి, లక్ష్మి, భవాని, రామ తులసి తదితరులు పాల్గొన్నారు.



టాపర్స్‌తో ఉపాధ్యాయులు, సిబ్బంది

సెల్ఫీ విత్ టాపర్స్‌తో విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం

ప్రజాశక్తి -సామర్లకోట రూరల్

విద్యార్థుల్లో పరీక్ష లంటే భయం పోగొట్టి ఆత్మ విశ్వాసం పెంపొందించడానికి ప్రభుత్వం సెల్ఫీ విత్ టాపర్స్‌కార్యక్రమం చేపట్టినట్టు ఆర్‌జెడి రాజు పేర్కొన్నారు. సోమవారం మధ్యాహ్నం స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులతో ఆయన ఫోటో దిగారు. ఇటీవల జరిగిన ఎఫ్ఎ-2 పరీక్షల వాల్యుయేషన్ పరిశీలించారు. ఈ విధానంలో ప్రత్యేకతలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ పి.పుల్లయ్య, హెచ్ఎం తోటకూర సాయి రామకృష్ణ, జి.గోవింద్, కెవివి.సత్యనారాయణ, ఎవివి.కుమారి, ఎ.శ్రీవల్లి పాల్గొన్నారు.

నేడు దిశ జిల్లా కమిటీ సమావేశం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

జిల్లా అభివద్ధి సమన్వయం మరియు పర్యవేక్షణ కమిటీ (దిశా)సమావేశం మంగళవారం మధ్యాహ్నం 2.30 గంటలకు జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలోని స్పందన సమావేశ మందిరంలో నిర్వహించడం జరుగుతోంది. ఈ కార్యక్రమంలో దిశా కమిటీ ఛైర్మన్, ఎంపి మార్గాని భరత్ రామ్, హోంమంత్రి డాక్టర్ తానేటి వనిత, జిల్లా కలెక్టర్ డాక్టర్ కె. మాధవీలత, ఉమ్మడి గోదావరి జిల్లా పరిషత్ ఛైర్మన్లు, ఎంఎల్‌సిలు, ఎంఎల్ఎలు, ఇతర ప్రజా ప్రతినిధులు పాల్గొంటారు.

యానాం వార్తలు



శిథిలమైన రెయిలింగ్

శ్మశాన వాటికలో సదుపాయాల కరువు

ప్రజాశక్తి - యానాం


స్థానిక ట్రైడల్ లాకు దిగువననున్న హిందూ శ్మశానవాటికలో సదుపాయాలు లేకపోవడంతో అంత్యక్రియలకు ఇబ్బందులు పడాల్సి వస్తుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భౌతికకాయాన్ని ఉంచి దహనం చేసే సిమెంట్ బెడ్ చుట్టూ ఉండే రెయిలింగ్ శిథిలమై అంత్యక్రియలకు ఆటంకం ఏర్పడుతుందని, దీనిపై ఎన్నిసార్లు అధికారులకు విన్నవించినా స్పందించడం లేదంటున్నారు. దీనికి తోడు శ్మశానవాటికకు వాచ్‌మెన్ లేకపోవడంతో గంజాయి బ్యాచ్ తమ అసాంఘిక కార్యకలాపాలకు ఉపయోగించుకుంటున్నారని చుట్టుపక్కల వాసులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికార యంత్రాంగం స్పందించి మౌలిక సదుపాయాలు కల్పించడంతోపాటు, స్మశానంలో అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

వివాహిత అదృశ్యంపై ఫిర్యాదు

రామచంద్రపురం : కె.గంగవరం మండలం కుందూరు గ్రామానికి చెందిన వివాహిత అదృశ్యమైందని ఆమె తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. తన కుమార్తె సుంకర వీర వెంకటలక్ష్మి ఈ నెల 5న మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకు వెళ్లింది. నాటి నుంచి ఆమె తిరిగి ఇంటికి రాకపోవడంతో బంధువులను వాకాబు చేసింది. ఎక్కడా ఆమె ఆచూకి తెలియకపోవడంతో ఆమె తల్లి ఎర్రంశెట్టి వెంకటరమణ సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కె.గంగవరం ఎస్ఐ జానీ భాష కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పంట కాలువపై ఆక్రమణ తొలగించాలని వినతి

ప్రజాశక్తి - తాళ్లరేవు



వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

తాళ్ళరేవు పక్షుల పుంత (బాబా జీవన్ నగర్)ను ఆనుకుని ఉన్న పంట కాలువ బోధిని ఒక రియల్ ఎస్టేట్ వ్యాపారి ఆక్రమించాడని ఆక్రమణలు తొలగించాలని సిపిఎం మండల కన్వీనర్ టేకుమూడి ఈశ్వరరావు ఆధ్వర్యంలో తహశీల్దారు కార్యాలయంలో సోమవారం వినతిపత్రం అందజేశారు. రియల్ ఎస్టేట్ వ్యాపారి తమ పంట బోదెను ఆక్రమించి గ్రావెల్‌తో నింపేశారని గ్రామస్తులు విలేకరులకు తెలిపారు. దీనివల్ల పూర్వం నుంచి ఉన్న పంట బోధి కోల్పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆర్ఐ రవితేజకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సుందరపల్లి సత్యనారాయణ, మందనక్క తణుకు రాజు, విప్పర్తి శ్రీనివాసరావు గోడి భాస్కర్ రావు పాల్గొన్నారు.

మానసిక విద్యార్థులకు ఆహారం పంపిణీ

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని పులిమేరులోని శాంతివర్ధన మానసిక వికలాంగ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు సోమవారం అన్నవరం దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యురాలు నేతల వెంకటలక్ష్మి, మున్సిపల్ కౌన్సిలర్ నేతల హరిబాబు దంపతులు పండ్లు, ఆహారం, పాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఓమ్‌సాయి భార్గవి, కమల రాజ్, ప్రీతి, మౌనిక పాల్గొన్నారు.

గృహ ప్రవేశాలకు సిఎం జగన్ రాక

ప్రజాశక్తి -సామర్లకోట రూరల్



సిద్ధమైన సభా వేదిక

ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డి సామర్లకోట పర్యటన ఖరారైంది. ఈ నెల 12వ తేదీన ఆయన సామర్లకోటకు వస్తున్నట్టు టూర్ షెడ్యూల్‌ను అధికారికంగా ఖరారు చేసినట్లు సోమవారం రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ దవులూరి దొరబాబు తెలిపారు.

ఈ నెల 12వ తేదీ గురువారం ఉదయం 10 గంటలకు హెలికాప్టర్లో పెద్దాపురం మున్సిపాలిటీ పరిధిలోని పెద్దాపురం రోడ్లోని 13వ వార్డులో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్దకు ముఖ్యమంత్రి జగన్ చేరుకుంటారు. అనంతరం అక్కడ 15 నిమిషాల పాటు ఆయన ప్రజలతో గడిపి వారి సమస్యలను వింటారు. అనంతరం ఇటిసి లేఔట్‌లోని జగనన్న కాలనీకి ప్రత్యేక బస్సులో చేరుకుంటారు. అక్కడ లబ్ధిదారులతో ముచ్చటిస్తారు. ఈ సందర్భంగా సామూహిక గహప్రవేశాలను ఆయన చేపట్టి ఫోటో ప్రదర్శనను తిలకిస్తారు. కాలనీ వద్ద ఏర్పాటు చేసిన వైయస్ రాజశేఖర్ రెడ్డి కాంస్య విగ్రహాన్ని జగన్ ఆవిష్కరిస్తారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల గ్రౌండ్స్‌లో ఏర్పాటు చేసిన సభా ప్రాంగణానికి చేరుకుంటారు. అనంతరం లబ్ధిదారులతో సిఎం ముఖాముఖి ఉంటుంది. అనంతరం ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. అనంతరం ప్రజాప్రతినిధులతో ఆయన సమావేశం తరువారం సిఎం జగన్ తిరిగి హెలికాప్టర్లో తాడేపల్లికి బయల్దేరి వెళతారు.

ఎస్‌కెఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

శ్రీమతి కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో జాబ్ మేళాను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రాఘవ కుమారి ఆధ్వర్యంలో సోమవారం జరిగింది. కంప్యూటర్ ఆపరేటర్స్, సూపర్వైజర్స్, అకౌంటెంట్ ఉద్యోగాల కొరకు జరిగిన జాబ్ మేళాలో విద్యా సంవత్సరంలో డిగ్రీ పొందిన 50కి పైగా విద్యార్థినులు పాల్గొన్నారు. టెక్నోటాక్స్, ముత్తూట్ ఫైనాన్స్, నవత ట్రాన్స్‌పోర్ట్, మోటోకార్ప్ కంపెనీలు పాల్గొన్నాయి. ఈ కార్యక్రమంలో ఐక్యూఏసి కోఆర్డినేటర్ డాక్టర్ బి.అనూరాధ, అకాడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ఎమ్.సునీత పాల్గొన్నారు.

చంద్రకుమార్‌కు క్రియేటివ్ ఆర్టిస్ట్ అవార్డు

ప్రజాశక్తి - అమలాపురం రూరల్

క్రియేటివ్ హార్ట్స్ అకాడెమీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఆకొండి అంజి ఆధ్వర్యంలో నిర్వహించిన వందే వేద భారతం చిత్ర కళా పోటీల్లో పాలగుమ్మి జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో చిత్రలేఖన ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్న పోలిశెట్టి నరసింహ చంద్రకుమార్ వేసిన రాముడు, సీత, లక్ష్మణుడు, హనుమంతుడు చిత్రానికి క్రియేటివ్ ఆర్టిస్ట్ అవార్డ్‌ను అందుకున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 360 మంది చిత్రకారులు ఇందులో పాల్గొన్నారు. ఏలూరుకు చెందిన ప్రముఖ చిత్రకారులు ఎం.రాంబాబు, ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ చైర్మన్ ఎన్.మనువిహార్ తదితరుల చేతుల మీదుగా ఆయన ఈ అవార్డును అందుకున్నారు.

నేటి యువతకు చేగువేరా ఆదర్శం

ప్రజాశక్తి-కాకినాడ



చేగువేరాకు నివాళులర్పిస్తున్న నాయకులు

చేగువేరా వంటి విప్లవకారుని నేటి విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ నాయకులు చెప్పారు. ఎస్ఎఫ్ఐ నగర సెక్రెటరీ వాసుదేవ్ అధ్యక్షుతన చేగువేరా 56వ వర్ధంతిని సంక్షేమ బాలుర హాస్టల్లో సోమవారం నిర్వహించరాఉ. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గంగా సూరిబాబు చేగువేరా చిత్రపటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం సూరిబాబు మాట్లాడుతూ చేగువేరా హక్కుల సాధనకు నిరంతరం పోరాటం చేశారన్నారు. పేదరికంలో ఉన్న ప్రజలకు, విద్యార్థులకు ఉచిత విద్య, వైద్యం అందచేయాలని చేగువేరా యుక్త వయస్సులో నుంచే ఉద్యమ పటిమతో సమాజంలో జరుగుతున్న అణిచివేతను ఎండగట్టి, ప్రజలను చైతన్య పరిచారన్నారు. చేగువేరా మంచివైద్యుడు, రచయిత, మేధావి అని అర్జెంటీనాలో పుట్టి, క్యూబా విప్లవోద్యమంలో పాల్గొరన్నారని కొనియాడారు.

మాజీ మంత్రి జక్కంపూడి నివాళి

ప్రజాశక్తి - అమలాపురం

అమలాపురం నల్లవంతెన వద్ద జక్కంపూడి రామ్మోహన్‌రావు విగ్రహానికి వైసిపి నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. జక్కంపూడి వర్ధంతి సందర్భంగా పలువురు మాట్లడారు. ఆయన సేవలను కొనియాడారు.ఈ కార్యక్రమంలో పట్టణ నాయకులు మద్దింశెట్టి ప్రసాద్, కల్వకోలను ఉమ, నవుండ్రు రమేష్, దాసం రాంబాబు, సుంకం స్వామి, రాజబాబు, సలాది గుప్తేశ్వరావు, మామిడిపల్లి రాము, కోటిపల్లి బాపన్న, జక్కంపూడి సత్యనారాయణ, కిరణ్, పెచ్చెటి నాని, కె.చిన్న పాల్గొన్నారు.

మామిడికుదురు : అప్పనపల్లిలో తులా గోపాలకష్ణ ఆధ్వర్యంలో సోమవారం మాజీ మంత్రి జక్కంపూడి రామ్మోహనరావు చిత్రపటానికి సర్పంచ్ గెడ్డం మహాలక్ష్మి, ఎంపిటిసి సభ్యులు బొంతు నీలిమ పూలమాలలు వేసి నివాళలర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పిచిక శివనాగసత్యనారాయణ, ఉపసర్పంచ్ మేడేపల్లి చిన్న, డాక్టర్ కంకిపాటి వెంకటేశ్వరరావు, కంకిపాటి హిమంతరావు, తదితరులు పాల్గొన్నారు.

దోమల నిర్మూలనకు చర్యలు చేపట్టాలి

ప్రజాశక్తి -సామర్లకోట రూరల్



వినతిపత్రం అందిస్నుత్న మానవహక్కుల సంఘం నాయకులు

సామర్లకోట మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల్లో ప్రజలు పలు రకాల జ్వరాలతో బాధ పడుతున్నందున పట్టణంలో దోమల నివారణకు మున్సిపల్ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని మానవ హక్కుల సంఘం నాయకులు మున్సిపల్ కమిషనర్ జె.రామారావుకు సోమవారం వినతిపత్రం అందజేశారు. నూతలపాటి అప్పలకొండ, ఎండి వలీ బాషా దోమల సమస్యపై విన్నవించారు. డ్రైన్లలో పూడికలు పేరుకుపోయి ఉండడంతో దోమల అభివద్ధి చెందుతున్నాయన్నారు. దామకాటుకు గురై అనేకమంది ప్రజలు డెంగ్యూ, మలేరియా, ఫైలేరియా, విష జ్వరాల వంటి బలహీనతలకు గురై ప్రభుత్వాసుపత్రుల్లో, ప్రైవేట్ ఆస్పత్రిలోనూ చికిత్స పొందుతున్నారన్నారు. దోమల బాధితులు ప్రతి ఇంటా ఉన్నందున అధికారులు తక్షణమే స్పందించి వార్డుల్లో, మురికి కాలువల్లో దోమల నివారణకు మందులను పిచికారీ చేసి ప్రజారోగ్యాన్ని కాపాడాలని కమిషనర్‌కు విన్నవించారు. దానికి కమిషనర్ వివరణ ఇస్తూ దోమల సమస్యపై తక్షణమే స్పందించనున్నట్టు హామీ ఇచ్చారు.

చిన్నారి వైద్యానికి 'అమ్మ' సాయం

ప్రజాశక్తి - మండపేట

చిన్నారి వైద్యం కోసం అమ్మ ఫౌండేషన్ రూ. 35 వేల ఆర్థిక సాయం అందించింది. రాజవొమ్మంగి మండలం చికిలింతకు చెందిన జర్రా రిషివర్ధన్ నిమజ్జన వేడుకల్లో గాయాల పాలవడంతో తల్లి దండ్రులు బాలుడిని కాపాడు కోవడానికి కాకినాడ జిజిహెచ్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న ఫౌండేషన్ వ్యవస్థాపకులు ఇమిడిసెట్టి నాగభూషణం దాతలు సహకారంతో రూ.35 వేలను సేకరించి పట్టణ ఎఎస్ఐ చిన్నారావు చేతుల మీదుగా బాలుడు తల్లిదండ్రులకు అందజేశారు.

భూములను ఆన్‌లైన్ చేయాలని విజ్ఞప్తి

ప్రజాశక్తి - తాళ్లరేవు



భూములను ఆన్లైన్ చేయాలని కోరుతున్న దళిత లబ్ధిదారులు

ఎస్‌సి కార్పొరేషన్ ద్వారా తమకు ఇచ్చిన భూములను ఆన్‌లైన్ చేయాలని దళిత ఆక్వా లబ్ధిదారులు మొర పెట్టుకున్నారు. ఈ సందర్భంగా తాళ్లరేవు తహశీల్దారు కార్యాలయం వద్ద లబ్ధిదారులు విలేకరులతో మాట్లాడారు. దళితుల లబ్ధిదారులు దిమ్మల జనార్ధన్, ద్రోణం సిద్ధార్థ కుమార్, యండమూరి సత్తిబాబు, ఈర్ల చిన్ననారాయణమూర్తి, పులిదిండి ప్రభావతి, మందపల్లి వెంకటస్వామి, యండమూరి బేతాళుడు తదితరులు విలేకరులతో మాట్లాడారు. ఎస్‌సి కార్పొరేషన్ ద్వారా 1988లో 10 మందికి, 1996లో 10 మంది లబ్ధిదారులకు ఒక్కొక్కరికీ ఎకరం చొప్పున చేపలు, రొయ్యలు పెంచుకోవడానికి చెరువులు కేటాయించారని తెలిపారు. వాటిని నేటికీ ఆన్‌లైన్ చేయలేదని తెలిపారు. వీరికి మద్దతుగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు టేకుమూడి ఈశ్వరరావు, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి వల్లు రాజబాబు నిలిచారు.

అభివృద్ధి, సుస్థిర లక్ష్యాల ఏర్పాటుపై అవగాహన

ప్రజాశక్తి- కపిలేశ్వరపురం

గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి, సుస్థిర లక్ష్యాలు, శాఖల వారీ లక్ష్యాలు, ఏర్పాటుపై కపిలేశ్వరపురం మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం మండల స్థాయి సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ ఎం.రామకృష్ణారెడ్డి, తహశీల్దార్ కె.సూర్యారావు ఆధ్వర్యంలో ఈ సమావేశం జరిగింది. మండల ప్రత్యేక అధికారి ఎ.శాంతి, ఎస్ఐ బి.చంటి, తదితరులు హాజరయ్యారు.